క్రైం వార్తలు

మహిళపై దాడి.. కేసు నమోదు

ఎర్రవల్లి: మహిళపై దాడి చేసిన ఘటనలో ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు కోదండాపురం ఎస్ఐ మురళి మంగళవారం తెలిపారు. మండల పరిధిలోని వేముల గ్రామానికి చెందిన జయకుమార్ అదే గ్రామానికి చెందిన ఓ యువతిని ప్రేమించాడు. అమ్మాయిని బంధువుల గ్రామమైన కర్నూల్ నుంచి అపహరించుకుపోయాడనే నెపంతో అమ్మాయి కుటుంబ సభ్యులు జయకుమార్ ఇంటికి వెళ్లి అతని తల్లి మరియమ్మను చెట్టుకు కట్టేసి భౌతికంగా దాడి చేసినట్లు తెలిపారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని బాధితురాలిని రక్షించారు. బాధితురాలు మరియమ్మ ఫిర్యాదు మేరకు గ్రామానికి చెందిన సుజాత, బద్రి, మహేశ్వరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

బొలెరో బోల్తా.. పది మందికి గాయాలు

అయిజ: వ్యవసాయ కూలీలను తరలిస్తున్న బొలెరో వాహనం బోల్తాపడి పది మంది కూలీలకు గాయాలయ్యాయి. ఎస్ఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాలు.. మంగళవారం రాజోళి మండలంలోని నరసూను, చిన్న ధన్వాడ గ్రామాలకు చెందిన 30 మంది వ్యవసాయ కూలీలు ఇటిక్యాల మండలం సాతర్ల గ్రామ శివారులో మిరప కోతలకు వెళ్లారు. సాయంత్రం నరసనూరు గ్రామానికి చెందిన సురేష్ బొలెరో వాహనంలో తిరిగి వస్తుండగా అయిజ మండల శివారులోని కిష్టాపురం సమీపంలో వాహనం అదుపుతప్పి బోల్తాపడింది. ప్రమాదంలో పది మంది కూలీలకు స్వల్పంగా గాయాలైనట్లు ఎస్ఐ తెలిపారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు ప్రమాదంపై వివరాలు అడిగి తెలుసుకున్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొట్టిన ఘటనలో..

గద్వాల క్రైం: గుర్తు తెలియని వాహనం ఢీకొట్టిన ఘటనలో ఇరువురు తీవ్రంగా గాయపడిన ఘటన జిల్లా కేంద్రంలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. మల్దకల్ మండలం అమరవాయి గ్రామానికి చెందిన వీరమ్మ, రామకృష్ణలు బైక్‌పై గద్వాలకు వస్తున్నారు. ఈ క్రమంలో పట్టణ శివారులోని రైల్వే స్టేషన్ సమీపంలో గుర్తు తెలియని వాహనం ఎదురుగా వస్తున్న వీరి బైక్‌ను ఢీ కొట్టింది. ప్రమాదంలో మహిళకు కాలు, చేయి విరిగినట్లు వైద్యులు తెలిపారు. సదరు వ్యక్తికి సైతం తీవ్ర రక్తగాయాలు కావడంతో మెరుగైన చికిత్స నిమిత్తం కర్నూల్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

మహిళకు గాయాలు

మల్దకల్: రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో మహిళ గాయపడిన ఘటన మండలంలోని అమరవాయిలో మంగళవారం చోటు చేసుకుంది. అమరవాయి గ్రామానికి చెందిన వీరమ్మ కుమారుడు రామకృష్ణారెడ్డితో కలిసి బైక్‌పై గద్వాలకు వెళ్లి స్వగ్రామానికి తిరిగి వస్తుండగా అయిజ నుంచి గద్వాలకు వస్తున్న మరో బైక్ ఎదురెదురుగా ఢీకొన్నాయి. ప్రమాదంలో వీరమ్మ తీవ్రంగా గాయపడగా రామకృష్ణారెడ్డి స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం గద్వాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా, మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

హైవేపై తప్పిన ప్రమాదం

ఎర్రవల్లి: జాతీయ రహదారిపై రెండు కార్లు ఢీకొన్న ఘటనలో పెను ప్రమాదం తప్పిన టన మంగళవారం చోటు చేసుకుంది. హైవే పెట్రోలింగ్ సిబ్బంది, స్థానికుల కథనం మేరకు వివరాలు.. హైదరాబాద్ నుంచి కర్నూల్ వైపు వెళ్తున్న కారును ఎర్రవల్లి నుంచి కర్నూల్ వైపు వెళ్తున్న మరో కారు జాతీయ రహదారిపై మునగాల శివారులో ఓవర్‌టెక్ చేయబోయి వెనుక నుంచి ఢీకొట్టింది. ప్రమాదంలో ఇరు కార్లలో ఉన్న ఐదుగురు వ్యక్తులు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. హైవే పెట్రోలింగ్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు.

రోడ్డు కబ్జాపై చర్య తీసుకోవాలి

ఎర్రవల్లి: మండల పరిధిలోని బీచుపల్లి గ్రామానికి చెందిన బోయ నర్సమ్మ తన ఇంటి ముందు ఉన్న అంతర్గత రోడ్డును కబ్జాచేసి ఇతరుల రాకపోకలకు ఇబ్బందులకు గురి చేస్తుందని అదే గ్రామానికి చెందిన అజయ్ కుమార్ మంగళవారం ఇటిక్యాల మండల పరిషత్ కార్యాలయంలో ఫిర్యాదు చేశాడు. సీసీ రోడ్డుపై చెట్లు, మొద్దులు, స్తంభాలు వంటి వాటిని అడ్డుగా వేసి గతకొంత కాలంగా ఇతరుల రాకపోకలకు ఇబ్బందులకు గురిచేస్తుందని ఫిర్యాదులో పేర్కొన్నట్లు తెలిపారు.

ఎస్ఓపై కలెక్టర్‌కు ఫిర్యాదు

గట్టు: మండల కేంద్రంలోని కస్తూర్బా పాఠశాల ఎస్ఓ గోపిలతపై అంతంపల్లి గ్రామానికి చెందిన అంజితోపాటు పలువురు గ్రామస్తులు కలెక్టర్‌తో పాటు, జిల్లా విద్యాధికారికి మంగళవారం ఫిర్యాదు చేశారు. ఇటీవల పాఠశాలలో పది, ఇంటర్ విద్యార్థినులకు వీడ్కోల సమావేశం నిర్వహించారు. సమావేశంలో ప్రోటోకాల్ పాటించకుండా మాజీ ప్రజాప్రతినిధిని ఆహ్వానించి, సన్మానించడం, అర్ధరాత్రి వరకు విద్యార్థుల చేత నృత్యాల చేయించాలరి ఫిర్యాదులో పేర్కొన్నారు.

మండలానికి ఒక్కరే అర్హులా!

- రుణం ఒక్కరికే.. దరఖాస్తులు 32
- పూర్తి మాఫీతో రూ.50 వేల రుణం
- అందరినీ ఆదుకోవాలంటున్న దివ్యాంగులు



ఉండవెల్లిలో దరఖాస్తులను పరిశీలిస్తున్న అధికారులు(ఫైల్)

ఉండవెల్లి: దివ్యాంగుల సంక్షేమం కోసం జాతీయ స్థాయిలో ఆర్థిక పునరావాస పథకం ద్వారా బ్యాంకు రుణం రూ.50 వేల కోసం దివ్యాంగులు గతనెల ఫిబ్రవరిలో నమోదు చేసుకున్నారు. జిల్లాలో 13 మండలాలకు గాను కేవలం 13 మందిని అర్హులుగా గుర్తించి రుణం మంజూరు చేసే విధంగా అధికారులు ప్రతిపాదనలు పంపారు. ఈ నేపథ్యంలో మండలానికి కేవలం ఒక్కరిని మాత్రమే అర్హులగా ఎంపిక చేయడం ఏంటని దివ్యాంగులు విమర్శిస్తున్నారు. దరఖాస్తు చేయడానికి కనీస సమాచారం కూడా అందుబాటులో లేదని ఆరోపిస్తున్నారు.

32 మంది దరఖాస్తు దారులు..

మండలంలోని 16 గ్రామ పంచాయతీలకు గాను 32 మంది దివ్యాంగులు రుణానికి దరఖాస్తు చేసుకున్నారు. దరఖాస్తు నమోదు చేయడానికి నోటిఫికేషన్ వివరాలు కూడా తెలియక ఇబ్బందులు పడినట్లు దివ్యాంగులు పేర్కొన్నారు. ఫిబ్రవరి నెల 23, 24 తేదీల్లో మాత్రమే దరఖాస్తు చేసుకున్న వారికి రుణం వెసులబాటు అవుతుందని అధికారులు పేర్కొన్నారు. ఆయా తేదీల్లో దరఖాస్తు చేసుకున్న వారికి సర్టిఫికెట్లు పరిశీలించారు.

మండలాల వారీగా..

ఉండవెల్లి మండల పరిధిలో ఉండవెల్లిలో–12, మారమునగాల–5, తక్కశిల–4, పుల్లూరు–3, చిన్నఆముదాలపాడు–2, బొంకూరు–1, ప్రాగటూరు–1, శేరుపల్లే–1, కలుగోట్ల–1, ఇటిక్యాలపాడు–1, కంచుపాడు–1 గ్రామాల నుంచి మొత్తం 32 మంది దరఖాస్తు చేసుకోన్నారు. కానీ కేవలం అందులో ఒక్కరికి మాత్రమే రూ.50 వేల జీవనోపాధికి దోహదపడేందుకు బ్యాంకర్లు రుణం అందజేస్తున్నారు. రూ.50 వేలు రుణం కూడా పూర్తి మాఫీ ఉన్నట్లు అధికారులు పేర్కొన్నారు.

కనీస సమాచారం లేదు..



అధికారులు ఎలాంటి నోటిఫికేషన్ లేకుండా రుణానికి లబ్ధిదారులను ఎంపిక చేస్తున్నారు. మండలానికి కేవలం ఒక్కరిని మాత్రమే అర్హులను ఎంపిక చేస్తే ఎలా దివ్యాంగుల అభివృద్ధికి ప్రభుత్వం సాయం చేయాలి.

– బోయ రాముడు, దివ్యాంగుడు, చిన్నఆముదాలపాడు

దరఖాస్తులు పరిశీలిస్తున్నాం..



రుణం కోసం నమోదు చేసుకున్న వారి దరఖాస్తులు పరిశీలించాం. మొదట ఉండవెల్లి మండలం రావడంతో దరఖాస్తు చేసుకున్న వారికి సమాచారం అందజేసి ధ్రువపత్రాలు పరిశీలించాము. అర్హులకు 45శాతం కంటే పైనే సదరం సర్టిఫికేట్ ఉండాలి.

– తిరుపతన్న, ఎంపీడీఓ, ఉండవెల్లి

ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవం



తారాపురంలో ఉపాధ్యాయులుగా విద్యార్థులు



ఇటిక్యాలలో ఉపాధ్యాయులతో విద్యార్థులు

ఇటిక్యాల/గట్టు: మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో మంగళవారం స్వయం పరిపాలన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి విద్యా బోధన చేశారు. అనంతరం వివిధ సాంస్కృతిక కార్యక్రమాల్లో విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు గోవిందు, ఉపాధ్యాయులు రేష్మాబేగం, అనూహ్య, నాగేంద్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

✦ గట్టు మండల పరిధిలోని తారాపురం ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు స్వయం పరిపాలన దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్ఎం సౌందర్య, ఉపాధ్యాయుడు సరియ, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ



పరీక్ష సామగ్రి పంపిణీ చేస్తున్న సోషల్ ఫోరం సభ్యులు

మల్దకల్: మండలంలోని పాల్వాయి జెడ్పీహెచ్ఎస్ విద్యార్థులకు మంగళవారం నడిగడ్డ తెలంగాణ సోషల్ ఫోరం అధ్యక్షుడు లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో పరీక్ష సామగ్రిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. మండల పరిధిలో పదో తరగతి పరీక్షల్లో మొదటి స్థానంలో నిలిచిన విద్యార్థులకు రూ.10వేలు, ద్వితీయ స్థానం రూ.5000, తృతీయ స్థానంలో నిలిచిన విద్యార్థులకు రూ.3000ల నగదు బహుమతి అందజేయనున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థులు పరీక్షల్లో మంచి ఉత్తీర్ణత సాధించి పాఠశాలతో పాటు తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు నర్సింహ్మాస్వామి, ఉపాధ్యాయులు నర్సింహ్మారెడ్డి, జలజ, వెంకటేష్, విజయభాస్కర్ రెడ్డి, ఫాతిమా, సోని విద్యార్థులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఇంటర్ పరీక్షలు



ధరూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పరీక్ష రాసేందుకు వెళ్తున్న విద్యార్థులు

మానవపాడు/ధరూరు: మండల కేంద్రంలోని శ్రీగంగు వెంకటకృష్ణారెడ్డి మెమోరియల్ ప్రభుత్వ జూనియర్ కళాశాల, పద్మావతి ఇంటర్ కాలేజీ పరీక్షా కేంద్రాలను మంగళవారం జిల్లా ఎగ్జామినేషన్ కమిటీ సభ్యుడు దేవేందర్‌రెడ్డి పరిశీలించారు. 207 మంది విద్యార్థులకు గాను 202 మంది పరీక్షకు హాజరైనట్లు చీఫ్ సూపరింటెండెంట్ వెంకటకృష్ణారెడ్డి పేర్కొన్నారు.

✦ ధరూరు మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ పరీక్షకు 367 మంది విద్యార్థులకు గాను 361 మంది హాజరైనట్లు చీఫ్ సూరింటెండెంట్ సత్యనారాయణ, డిపార్ట్‌మెంటల్ అధికారి శేఖర్ తెలిపారు. కార్యక్రమంలో కళాశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వాల్మీకి బోయలను ఎస్టీ జాబితాలో చేర్చండి



మాట్లాడుతున్న ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు

శాంతినగర్: వాల్మీకి బోయలను ఎస్టీ జాబితాలో చేర్చాలని వాల్మీకి సంఘ అలంపూర్ తాలూక ప్రధాన కార్యదర్శి బోయ వెంకటేష్ ప్రభుత్వాన్ని కోరారు. బోయలను ఎస్టీ జాబితాలో చేర్చే విషయమై మంగళవారం శాంతినగర్‌లో విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం చెల్లప్ప కమిటీని వేసి అసెంబ్లీలో తీర్మానం చేసిందని, కేంద్ర గిరిజనశాఖ మంత్రి ప్రతిపాదనలు పరిగణనలోకి తీసుకుని వాల్మీకి బోయలను ఎస్టీ జాబితాలో చేర్చాలన్నారు. అదే విధంగా ఎంపీ డీకే అరుణ పార్లమెంట్‌లో వాల్మీకి బోయలను ఎస్టీ జాబితాలో చేర్చాలని గళం విప్పినందుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాసులు, మద్దిలేటి, యల్లప్ప, రాముడు, నరసింహ, నాగరాజు పాల్గొన్నారు.

యువకుడిపై కర్రలతో దాడి



దాడిలో గాయపడిన రాము

గద్వాల క్రైం: ఓ యువకుడిపై గుర్తు తెలియని యువకులు దాడి చేసిన ఘటన మంగళవారం సాయంత్రం జిల్లా కేంద్రంలో జరిగింది. స్థానికులు, బాధితుడి కథనం మేరకు... గంజిపేటకు చెందిన రాము పట్టణంలోని ఓ ప్రైవేటు ఫైనాన్స్‌లో పని చేస్తున్నాడు. గత మూడు రోజుల క్రితం మల్దకల్ మండలానికి చెందిన యువకులతో వాగ్వివాదం జరిగింది. ఈ క్రమంలో ఓ వర్గానికి చెందిన యువకులు మంగళవారం రాత్రి 10మందికి పైగా వచ్చి రాముపై కర్రలతో విచక్షణ రహితంగా దాడిచేశారు. స్థానికులు చికిత్స నిమిత్తం జిల్లా ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు చెబుతున్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు దాడి సంఘటనపై ఆరా తీస్తున్నారు.

ఇన్‌చార్జి సెక్రటరీగా బాధ్యతల స్వీకరణ

మానవపాడు: మండలంలోని పెద్దపోతులపాడు గ్రామ ఇన్‌చార్జి సెక్రటరీగా మంగళవారం జయమ్మ బాధ్యతలు స్వీకరించినట్లు ఎంపీడీఓ భాస్కర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుత సెక్రటరీగా ఉన్న ప్రభావతిపై విధులకు హాజరుకావడం లేదన్న ఫిర్యాదు మేరకు ఆమె స్థానంలో చందూరు సెక్రటరీగా విధులు నిర్వహిస్తున్న జయమ్మ అదనపు బాధ్యతలు అప్పగించినట్లు పేర్కొన్నారు.

సేవింగ్ ఖాతా పుస్తకాలు అందజేత

ఎర్రవల్లి: మండల పరిధిలోని బి.వీరాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు మంగళవారం టీజీబీ ఆధ్వర్యంలో జీరో బ్యాలెన్స్ బ్యాంక్ ఖాతా పుస్తకాలు అందజేశారు. ప్రధానమంత్రి జన్‌ధన్ యోజన పథకం ద్వారా సుమారు 70 మంది విద్యార్థులకు తెలంగాణ గ్రామీణ బ్యాంక్ సాసనూలు బ్రాంచి మేనేజర్ రాఘవేంద్రారెడ్డి ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం వెంకటేశ్వర్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గిట్టుబాటు ధర ఇవ్వాలి

రాజోళి: మొక్కజొన్న పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని బీజేపీ మండల అధ్యక్షుడు శశికుమార్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన సాక్షితో మాట్లాడుతూ.. అష్టకష్టాలు పడి మొక్కజొన్న పంట సాగు చేసిన రైతులకు ధర విషయంలో అన్యాయం జరుగుతుందన్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో వ్యాపారులు, దళారులే మొక్కజొన్న పంట కొనుగోలు చేస్తున్నారన్నారు. దళారుల మాయతో రైతులకు ధర రాకపోగా వివిధ రకాలుగా మోసపోతున్నారని ఆరోపించారు. ప్రభుత్వం మొక్కజొన్న పంట కొనుగోలు చేసి రైతులు నష్టపోకుండా చూడాలరు. కార్యక్రమంలో సంజీవ రెడ్డి, అంజి, రాము తదిదరులు పాల్గొన్నారు.

శంభాజీకి ఘన నివాళి

అయిజ: పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో మంగళవారం మరాఠ యోధుడు మహవీర్ శంభాజీ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు భగత్‌రెడ్డి మాట్లాడారు. పరమతాన్ని స్వీకరించకుండా వీరమరణం పొందిన శంభాజీ జీవిత గాథ నేటి తరానికి ఆదర్శమన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు నాగరాజు, నరసింహులు, మధు, లక్ష్మణాచారి, రాఘవేంద్ర చారి, ప్రవీణ్, వీరేష్, రఘు, పరుశురాముడు, అంజి, శివాజీ తదితరులు పాల్గొన్నారు.

సృజనాత్మకత వెలికితీసేందుకు దోహదం

కేటీదొడ్డి: విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకత వెలికితీయడానికి సబ్జెక్ట్ మేళా ఎంతో ఉపయోగపడుతుందని హెచ్ఎం అర్చన అన్నారు. మంగళవారం మండలంలోని మాల్లాపురం పాఠశాలలో ఎంపీ ఫౌండేషన్, మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో మండల స్థాయి సబ్జెక్ట్ మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగు, ఇంగ్లిష్, గణితం, సామాన్య శాస్త్రం సబ్జెక్ట్‌ల వారీగా వివిధ రకాలైన టీఎల్ఎం మెటీరియల్ ప్రదర్శించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ఉన్నారు.

ఎండిన వరిపంట వివరాల నమోదు

కేటీదొడ్డి: మండలంలోని కొండాపురం, గువ్వలదిన్నె, గ్రామాల్లో ఆయకట్టు కింద సాగు చేసిన వరి పంటను సహాయ వ్యవసాయ అధికారి సంగీత, మండల వ్యవసాయ అధికారి సాజిద్ రెహ్మాన్ పరిశీలించారు. ఎండిన వరి పంట వివరాలు నమోదు చేసుకున్నారు. సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని రైతులకు భరోసానిచ్చారు. కార్యక్రమంలో ఏఈఓ ప్రియాంక, అధికారులు, రైతులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల పరిశీలన

మానవపాడు: మండలంలోని పల్లెపాడు, చందూరు, బోరవెల్లి గ్రామాల్లో మంగళవారం జాతీయ ఉపాధి హామీ పనులను ఎంపీడీఓ భాస్కర్ పరిశీలించారు. పొలం బాట కార్యక్రమంలో భాగంగా రూ.8 లక్షలతో పనులు చేపడుతున్నట్లు తెలిపారు. కాలువలు, రోడ్ల వెంట పనులు త్వరగా పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించారు.

కృషి విజ్ఞాన కేంద్రం ఏర్పాటు చేయాలి



వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

అయిజ: మండలంలో కృషి విజ్ఞాన కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి కోరారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయంలో అడ్మినిస్ట్రేషన్ అధికారి నరేందర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రామచంద్రారెడ్డి మాట్లాడారు. వ్యవసాయ రంగంలో నూతన సాంకేతిక ఉత్తమ యాజమాన్య పద్ధతులు అమలు చేసేందుకు, అన్నదాతల్లో చైతన్యం కల్పించేందుకు ఉద్దేశించిన కృషి విజ్ఞాన కేంద్రాలను అన్ని జిల్లాలకు విస్తరించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఈ నేపథ్యంలో మండలంలో నూతన కేవీకే ఏర్పాటు చేయడానికి అన్ని విధాలుగా అనుకూలతలు ఉన్నాయన్నారు. అదే విధంగా మండల కేంద్రంలో ఏడీఏ, ఎంఏఓ కార్యాలయాలను విశాలంగా, అన్ని సదుపాయాలతో నిర్మించాలని కోరారు. ఎక్లాస్‌పురానికి అనుబంధ గ్రామంగా ఉన్న దేవబండను నూతన గ్రామపంచాయతీగా ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు నరసింహులు, ఓబీసీ జిల్లా అధ్యక్షుడు దేవదాస్, మండల అధ్యక్షుడు గోపాలకృష్ణ, లక్ష్మణ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అట్టహాసంగా బండలాగుడు పోటీలు



పోటీలో వృషభాలు

శాంతినగర్: వడ్డేపల్లి మండల పరిధిలోని జూలెకల్ శివారులోని భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి జాతర ఉత్సవాల్లో భాగంగా మంగళవారం పశువుల బండలాగుడు పోటీలు నిర్వహించారు. హోరాహోరీగా సాగిన పోటీల్లో మొదటి బహుమతి ప్యాపిలి మంగళి నాగయ్య, రెండో బహుమతి శ్రీరాములు యాదవ్ పీఆర్‌పల్లి, రామచంద్రారెడ్డి, క్రిష్టాపురం, మూడో బహుమతి మంగళి నాగయ్య, నాల్గవ బహుమతి వల్కూరు తిరుమలేష్, ఐదో బహుమతి హర్షిణి బుల్స్ సింగవరం కైవసం చేసుకున్నాయి. విజేతలైన వృషభాల యజమానులకు దాతలు నగదు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఆలమ కమిటీ చైర్మన్ సత్యన్న, సభ్యులు, జూలెకల్ గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

పరిమితికి మించి ప్రయాణం నేరం



అలంపూర్ చౌరస్తా టోల్‌ప్లాజా వద్ద అవగాహన కల్పిస్తున్న పోలీసులు



జూరాల డ్యాంపై తనిఖీలు చేస్తున్న పోలీసులు

మానవపాడు/అలంపూర్/ధరూరు: వాహనాల్లో పరిమితికి మించి ప్రయాణం చేయడం నేరమని ఎస్ఐ చంద్రకాంత్ అన్నారు. మంగళవారం మానవపాడు మండల కేంద్రంలో వాహన తనిఖీల నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వాహనాల్లో పరిమితికి ప్రయాణిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. పలు వాహనాలను తనిఖీ చేసి డ్రైవర్లకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

✦ అలంపూర్ చౌరస్తా సమీపంలోని పుల్లూరు టోల్ ప్లాజా వద్ద ఆటో డ్రైవర్లకు ఉండవెల్లి ఎస్ఐ మహేష్ అవగాహన సదస్సు నిర్వహించారు. తదితర ప్రాంతాల నుంచి కూలీలతో వచ్చిన ఆటోలను నిలిపివేశారు. రోడ్డు భద్రతా నిబంధనలు పాటించాలన్నారు. ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను తరలిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ట్రైనీ ఎస్ఐ కుమార్, కానిస్టేబుళ్లు బాష, రవి తదితరులు పాల్గొన్నారు.

✦ జూరాల ప్రాజెక్టు రోడ్డుపై ఎస్ఐ శ్రీహరి నేతృత్వంలో ముమ్మరంగా వాహన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గూడ్స్ తరలించే వాహనాల్లో ప్రజలను తరలించడంపై ప్రత్యేక దృష్టి సారించారు. డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు చేపట్టి పలువురికి జరిమానాలు విధించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఓఎంఆర్ షీట్లపై అవగాహన కల్పించాలి



గుడ్డెందొడ్డి గురుకుల పాఠశాలలో పరిశీలిస్తున్న డీసీఈబీ సెక్రటరీ ప్రతాప్‌రెడ్డి

ధరూరు: పతో తరగతి విద్యార్థులకు ఆన్సర్, ఓఎంఆర్ షీట్లపై అవగాహన కల్పించాలని డీసీఈబీ సెక్రటరీ ప్రతాప్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని గుడ్డెందొడ్డి వద్ద నిర్వహిస్తున్న తెలంగాణ స్టేట్ బీసీ రెసిడెన్షియల్ (అలంపూర్) పాఠశాలను ఆయన సందర్శించారు. యాక్షన్ ప్లాన్‌లో భాగంగా విద్యార్థులకు నిర్వహిస్తున్న ప్రత్యేక పరీక్షలను పరిశీలించారు. ఈ సందర్భంగా పరీక్షలో విద్యార్థులు నంబర్లు వేయకపోవడాన్ని గుర్తించి ఉపాధ్యాయులకు విద్యార్థులకు నంబరింగ్‌పై అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. అనంతరం రికార్డులు పరిశీలించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జాన్సీ, సీఆర్పీ నర్సింహులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

వడదెబ్బ నివారణ చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న వైద్యురాలు ఆయేషా బేగం

ధరూరు: ఎండ తీవ్రత రోజురోజుకు పెరుగుతున్నందున వడ దెబ్బకు గురి కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ ఆయేషా బేగం అన్నారు. వాతావరణంలో మార్పులు, వాటి వల్ల కలిగే నష్టాలు, నివారణ మార్గాలపై మంగళవారం వైద్య సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలనుద్దేశించి మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో వడదెబ్బ గురించి ప్రజలకు అవగాన కల్పించాలన్నారు. అత్యవసరమైతే తప్పా మధ్యాహ్నం వేళల్లో బయటకు రావద్దన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు హీర్యానాయక్, ఆనందయ్య, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

అధికారుల సలహాలు పాటించాలి



వీడియో కాన్ఫరెన్స్‌లో వ్యవసాయ అధికారులు

మల్దకల్: రైతులు వ్యవసాయ అధికారుల సలహాలు సూచనలు తప్పనిసరిగా పాటించాలని మండల వ్యవసాయ అధికారి రాజశేఖర్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర వ్యవసాయశాఖ అధికారులు నేరుగా రైతులు, అధికారులతో మాట్లాడారు. పంటల సాగు విధానంపై అవగహన కల్పించారు. పంటలకు ఆశించే చీడపీడల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలియజేశారు. రసాయనిక ఎరువుల వాడకం తగ్గించాలన్నారు. సేంద్రీయ ఎరువుల వాడకం ద్వారానే భూమి సారవంతంగా ఉంటుందన్నారు. తక్కువ పెట్టుబడులతో ఎక్కువ లాభాలు వచ్చే పంటలు సాగు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఈఓలు, రైతులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

ధరూరు: మండల కేంద్రంలోని రైతు వేదిక వద్ద మంగళవారం గద్వాల పట్టణానికి చెందిన సాయి కృప ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. డాక్టర్ శరత్ ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల నాయకుడు శ్రీనివాస్‌రెడ్డి, ఆర్ఎంపీ నౌషద్, టెక్నీషియన్ వెంకటేశ్వరరెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

